క్లుప్తంగా

పుస్తెమెట్టెల అందజేత



పుస్తెమెట్టెలు అందిస్తున్న నాయకులు

గంభీరావుపేట: ముస్తాబాద్ మండలం సేవాలాల్ తండా గ్రామానికి చెందిన దరంసోత్ రాజవ్వ–శంకర్‌నాయక్ కూతురు నిర్మల వివాహానికి ఎంపీపీ జనగామ శరత్‌రావు పుస్తెమెట్టెలు అందించారు. సర్పంచ్ శ్రీనివాస్ నాయక్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, బాపురావు, రెడ్యానాయక్, నర్సింలు, పంతులు నా యక్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప మహా పడిపూజ

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయంలో సోమవారం అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప సేవాసమితి సభ్యులు ఆదివారం తెలిపారు. ఉదయం 6 గంటలకు గణపతి హోమం అనంతరం మండలకేంద్రంలోని పురవీధుల్లో పల్లకిలో స్వామివారి ఊరేగింపు, మధ్యాహ్నం 12 గంటలకు చక్రస్నానం, అభిషేకం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు కేరళకు చెందిన బ్రహ్మశ్రీ ఉన్నికృష్ణన్ నంబూద్రి చేతుల మీదుగా మహా పడిపూజ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి గురుస్వాములు రాజు, శ్రీను హాజరవుతారన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. .

ఆలయంలో పూజలు



గంభీరావుపేట: మండలకేంద్రంలోని బరిగెలగూడెం కాలనీలోని పోచమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ కటకం శ్రీధర్ పంతులుతో పాటు కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన



పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకట రమణా రెడ్డి

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలకేంద్రంలోని మినీ గ్రౌండ్ ఏర్పాటు పనులను ఆదివారం ఎంపీపీ వుట్కూరి వెంకట రమణా రెడ్డి పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయనతోపాటు పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చెట్టు నరికివేతపై కార్యదర్శికి ఫిర్యాదు



ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): పర్యావరణ పరిరక్షణకు కోసం పెంచుతున్న పచ్చని చెట్లను కొందరు ఇష్టానుసారంగా నరికేస్తున్నారు. మండలకేంద్రంలో పర్యావరణ ప్రేమికుడు దుంపెన రమేశ్ ఐదేళ్లుగా తన ఇంటి వెనుకాల చెట్లు పెంచుతున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో వీర్నపల్లి మండలం మద్దిమల్లకు చెందిన రఫిక్ అనే వ్యక్తి టేకు చెట్టును నరికివేసి కర్రను స్వాధీనం చేసుకున్నాడు. దీనిపై రమేశ్ సదరు వ్యక్తిని అడిగితే తానే చెట్టును నరికానని, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకొమ్మని బదులిచ్చాడని రమేశ్ తెలిపారు. సదరు వ్యక్తిపై వాల్టాచట్టం కింద కేసునమోదు చేసి చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి ఆదివారం ఫిర్యాదు చేశాడు. ఇటీవల మండలకేంద్రంలో చెట్లను నరికిన ఐదుగురికి అధికారులు జరిమానాలు విధించినా కొందరిలో మార్పురాకపోవడం లేదు.

వణుకుతున్న పల్లెలు



వీర్నపల్లి : మండలంలోని పలుగ్రామాల్లో చలి తీవ్రత పెరగడంతో ప్రజలు గజగజ వణుకుతున్నారు. ఆదివారం ఉదయం 8 గంటల వరకు చలి తగ్గకపోవడంతో హోటళ్ల వద్ద ప్రజలు చలిమంటలు వేశారు. చిన్నారులు, వృద్ధులు రాత్రి 7 గంటలకే ఇంట్లోంచి బయటకు రావడానికి జంకుతున్నారు.

నాణ్యతకు తిలోదకాలు..

- కుంగుతున్న సుద్దాల – మారుపాక వంతెన
- నిర్మాణంలో నాణ్యతా లోపం
- వాహనదారుల ఇబ్బందులు
- మరమ్మతు చేపట్టాలని డిమాండ్

కోనరావుపేట: మండలంలోని సుద్దాల – వేములవాడ మండలం మారుపాక గ్రామాల మధ్య ఉన్న వాగుపై నుంచి వరదతో రవాణా నిలిచిపోయేది. రవాణా సౌకర్యం లేక మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఒర్రెపై వంతెన నిర్మించడంతో తమ ఇబ్బందులు తీరాయని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు ఆనందపడ్డారు. కానీ ఆ సంతోషం మూణ్నాళ్ల ముచ్చటగానే నిలవనుంది. వంతెన పగుళ్లుబారుతూ, ఇరువైపులా రహదారి కుంగుతుండడంతో మళ్లీ రవాణా కష్టాలు ప్రారంభయ్యాయి.

మండలంలోని సుద్దాల-వేములవాడ మండలం మారుపాక గ్రామాల మధ్య ఒర్రెపై వంతెన నిర్మాణానికి పీఎంజీఎస్‌వై నుంచి రూ.81లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబు 2017 నవంబర్‌4న పనులు ప్రారంభించారు. ఈ నిధులతో సుద్దాల-మర్తనపేట ప్రధాన రహదారిలో వంతెన నిర్మించారు. నిర్మించిన కొద్దినెలలకే వంతెన పగుళ్లు బారుతుండగా, వంతెన ఇరు పక్కల ఉన్న రోడ్డు కుంగిపోతుంది. దీంతో తరచూ



సుద్దాల-మారుపాక వంతెన



రోడ్డు ప్రమాదాలు జరుగుతూ వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

తరచూ ప్రమాదాలు

వంతెన ప్రమాదకరంగా మారడంతో ఈ ప్రదేశంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పగటిపూట వచ్చే వాహనాలు సైతం దెబ్బతింటున్నాయి. రాత్రి వేళలో మరీ ఇబ్బంది పడుతున్నారు. రహదారి కుంగడంతో వాహనాలు అదుపుతప్పి గాయాలపాలవుతున్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో ఇరుపక్కల నిర్మించిన సైడ్‌వాల్స్ పగుళ్లు బారుతున్నాయి.

పనులు చేయిస్తాం

కోనరావుపేట మండలం సుద్దాల – మారుపాక గ్రామాల మధ్యగల ప్రధాన రహదారిలో నిర్మించిన వంతెన వద్ద రోడ్డు కుంగుతోంది. వంతెన పక్కల కుంగిన ప్రదేశంలో మరమ్మతులు చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. తొందర్లోనే మరమ్మతు పనులు చేయించి వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం.

–సత్యనారాయణ,డీఈ, పంచాయతీరాజ్

మరమ్మతు చేపట్టాలి



మండలంలోని మంగళ్లపల్లి, సుద్దాల, కనగర్తి, పల్లిమక్త తదితర గ్రామాల ప్రజలకు వేములవాడ నియోజకవర్గ కేంద్రానికి ఈ రోడ్డే ప్రధానం. ఈ రోడ్డు నాణ్య తా లోపం కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ వంతెన వద్ద మరమ్మతు పనులు చేయించాలి.

– ప్రవీణ్, బీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు

వాహనాలు దెబ్బతింటున్నాయి



మండలంలోని పలు గ్రామాల ప్రజలు వేములవాడ, కరీంనగర్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. ఈ వంతెన ఇరుపక్కల రోడ్డు కుంగుతుండడంతో వాహనాలు వెళ్లడం కష్టంగా మారుతోంది. ద్విచక్ర, పెద్దవాహనాలు దెబ్బతింటున్నాయి.

– సీహెచ్. కిషన్, సుద్దాల

హామీలన్నీ అమలుచేస్తాం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



కోనరావుపేట : గొల్లపల్లిలో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట(వేములవాడ): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రాజన్న గొల్లపల్లి(కొలనూర్)లో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. పార్టీలకతీతంగా అభివృద్ధికి కృషిచేయాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎంపీపీ చంద్రయ్య, సర్పంచులు బొజ్జం వసంత, వెన్నమనేని వంశీకృష్ణరావు, కెంద గంగాధర్, ఫోరం కన్వీనర్ గోపు పర్శయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పాప వైద్యానికి సాయం అందించండి

తమ రెండేళ్ల పాపకు గ్రహణమొర్రి ఆపరేషన్ చేయాలని వైద్యులు తెలిపారని, పాప వైద్యం కోసం సాయం అందించాలని మర్తనపేటకు చెందిన ఓరుగంటి రజిత ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను వేడుకున్నారు. గ్రామానికి చెందిన ఓరుగంటి సందీప్-రజితకు ఇద్దరు కుమారులు, రెండు నెలల కుమార్తె ఉంది. కూలీ పనులు చేస్తూ జీవించే తమకు వైద్యం చేయించే స్తోమత లేదని, సహకారం అందించాలని వేడుకుకున్నారు. వైద్యులతో మాట్లాడి వైద్యమందేలా చూస్తానని ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కోనరావుపేట: మండల శాలివాహన సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. సంఘం మండలాధ్యక్షుడు పర్శరాములు, నాయకులు పాల్గొన్నారు.

చందుర్తి : మండలంలోని నర్సింగపూర్‌లో మోహినికుంట శ్రీ మల్లికార్జున స్వామి కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు రామస్వామి, పార్టీ శ్రేణులు ఉన్నారు.

మొక్కు చెల్లింపు

సనుగుల శ్రీగోవిందరాజు స్వామికి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మొక్కు చెల్లించుకున్నారు. జెడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు లింగారెడ్డి, సనుగుల సింగిల్‌విండో డైరెక్టర్ కేతిరెడ్డి నాగిరెడ్డి, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు ఏగోలపు శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చల్మెడకు సన్మానం

స్వామివారి కల్యాణ మహోత్సవంలో బీఆర్ఎస్ వే ములవాడ నియోజక వర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు. సెస్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు, తదితరులున్నారు.

వేములవాడ : పట్టణానికి చెందిన పీఏసీసీ డైరెక్టర్ తోట రాజు ద్విచక్రవాహనం పైనుంచి పడి తీవ్ర గాయాలుకాగా ఆస్పత్రిలో పొందుతున్నాడు. ఆది



చందుర్తి : మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఆది శ్రీనివాస్

శ్రీనివాస్ పరామర్శించారు. శబరిమలై యాత్రలో భాగంగా అనంతపురం జిల్లాలో ప్రమాదానికి గురైన చిక్కుడు మల్లేశంను పరామర్శించారు.

శాలివాహన క్యాలెండర్ ఆవిష్కరణ

కోనరావుపేట మండలానికి చెందిన శాలివాహన కుమ్మరి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆయన నివాసంలో ఆవిష్కరించారు.

‘ఆది’కి సన్మానం

వేములవాడ పట్టణానికి చెందిన గంగపుత్ర సంఘం నాయకులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. గంగపుత్ర సంఘం నాయకులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సేవాసంఘం కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఎల్లారెడ్డిపేట: మండల పద్మశాలీ సేవాసంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాపెల్లి దేవాంతం, ప్రధాన కార్యదర్శిగా వనం రమేశ్, ఉపాధ్యక్షులుగా గొసికె దేవదాస్, శ్రీరామ్ సుదర్శన్, సంయుక్త కార్యదర్శిగా రాపెల్లి అంబదాస్, కోశాధికారిగా వనం బాల్‌రాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ దుంపెన గౌరీశంకర్, సోషల్ మీడియా కన్వీనర్‌గా దోమల భాస్కర్, దైవశెట్టిగా మ్యాన భగవాన్‌ను ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా వనం బొందయ్య, ఎల్లయ్య, గాజుల దేవదాస్, మహేశ్ ఎన్నికయ్యారు. యువజన విభాగం అధ్యక్షుడిగా సుంకి భాస్కర్, ఉపాధ్యక్షులుగా దూస శ్రీనివాస్, ఆడెపు శ్రీపతి, కార్యదర్శిగా ఆడెపు అజయ్, సంయుక్త కార్యదర్శిగా గొసికె శ్రీనివాస్, సుంకి విష్ణుమూర్తి ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షుడు పోతు ఆంజనేయులు, గంగారామ్, నాగరాజు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నంద్యాడపు అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా కూర్మాచెలం సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా పోగుల మోహన్, కోశాధికారిగా తుమ్మనపెల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ప్రెస్‌క్లబ్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు దేశవేని ధర్మేందర్, ఎలిగేటి సూర్యకిరణ్, బింగిశెట్టి వెంకటేశ్, నుడిగెవు పర్శరాములు, పడాల రమణ, ఎలిగేటి ప్రదీప్, పత్తిపాక నాగరాజు, తదితరులున్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



నెత్తిన బోనాలతో మహిళలు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కొదురుపాక శ్రీ సీతాలదేవి పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పోచమ్మ బోనాలు తీశారు. మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ జోగిన పల్లి వెంకట్రామారావు తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి: మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన వంకాయల సుధాకర్ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఆదివారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. కేకే.మహేందర్ రెడ్డి రూ.5 వేలు అందజేయగా బాధిత కుటుంబానికి అందించారు. ఉప సర్పంచ్ సత్తు తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మందాటి తిరుపతి, గ్రామస్తులు తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

తంగళ్లపల్లి: మండలంలోని బస్వాపూర్ గ్రామస్తులు తమ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కేకే.మహేందర్ రెడ్డికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. రంగనాయక సాగర్ కెనాల్ పనులను వెంటనే పూర్తిచేసి చెరువులు నింపాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, నాయకులు సత్తు శ్రీనివాస్ రెడ్డి, మందాటి తిరుపతి యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాసోత్సవాలు



ఎల్లారెడ్డిపేట: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండలకేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, నివేదన, మహాగణపతి పూజ, అంకురార్పణ, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను వేద పండితులు నవీన్‌చారి నిర్వహించారు. నెలరోజుల పాటు ధనుర్మాసోత్సవాలు జరుగుతాయని పండితులు తెలిపారు. ఆలయంలో మహిళలు అయోధ్య రాములవారికి అక్షింతలను సిద్ధం చేస్తున్నారు. ధనుర్మాసంలో చివరగా గోదా రంగనాథుల స్వామి కల్యాణ వేడుకలతో ఉత్సవాలు ముగుస్తాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్, వైస్‌చైర్మన్ గంట వెంకటేశ్ గౌడ్, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పదిరలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కేంద్రప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం ప్రవేశపెడుతున్న పథకాలను అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి మద్దుల బుగ్గారెడ్డి అన్నారు. మండలంలోని పదిరలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 250 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్, పీఎం సురక్ష భీమా యోజన, పీఎం జీవనజ్యోతి భీమా యోజన, పీఎం స్వావనిధి యోజన, ,ఉజ్వల యోజన తదితర పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలను ప్రజలు వినియోగించుకునేలా పార్టీ కార్యకర్తలు, అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంబాల వజ్రమ్మ, బీజేపీ నాయకులు పర్శరాములు, సల్ల సత్యంరెడ్డి, పర్శరాములు, నరేశ్, ,గ్రామస్తులు పాల్గొన్నారు.

చెట్టుకు కార్యాలయం బోర్డు



వేములవాడరూరల్: వేములవాడ మార్కెట్ యార్డులోని సహాయ వ్యవసాయ సంచాలక కార్యాలయం బోర్డును చెట్టుకు ఉంచారు. మార్కెట్‌యార్డులో ఈ కార్యాలయం ఉన్నట్లు చాలామందికి తెలియదు. ప్రధాన గేటు వద్ద ఏర్పాటు చేయాల్సిన కార్యాలయ బోర్డును అధికారులు చెట్టుపై ఉంచడంతో బోర్డును చూసిన పలువురు ఇదేంటని వాపోతున్నారు.

పోలీసుల వాహనాల తనిఖీ



ఎల్లారెడ్డిపేటలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంకేంద్రంలో ఆదివారం రాత్రి పోలీసులు భారీగా వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రమాకాంత్ ఎల్లారెడ్డిపేట, రాచర్ల గొల్లపల్లి రహదారుల్లోని పలు ప్రాంతాల్లో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పలువురికి జరిమానాలు విధించారు. పలు వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఇల్లంతకుంటలో..



డ్రంకెన్ డ్రైవ్ చేస్తున్న ఎస్సై సుధాకర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలకేంద్రంలో ఆదివారం రాత్రి ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహన తనిఖీ, డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్లపై వేడుకలు జరిపినా, మద్యంతాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు